

నిలిచిన సమావేశాలు

సింగరేణిలో కార్మికుల సమస్యలపై చర్చించి ఒప్పందాలు చేసుకునే స్ట్రక్చరల్, జేసీసీ, సేఫ్టీ ట్రైపార్టియేట్ వంటి ముఖ్యమైన సమావేశాలు నిలిచిపోయాయి. దీంతో కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. 8లో▸



'గురుకులం'లో ప్రవేశాలు

కేజీ టు పీజీ ఉచిత విద్యలో భాగంగా ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.3 /21.0

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. భానుడి ప్రతాపం కొనసాగుతుంది. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం అంతగా ఉండదు.

న్యూస్‌రీల్

అడవిలో మంటలు అదుపులోకి..



మంటలు ఆర్పుతున్న అటవీ సిబ్బంది

కాసిపేట: తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట మండలాల శివారులోని బుగ్గ అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి అంటుకున్న మంటలను అటవీ శాఖ అధికారులు ఆదివారం మధ్యాహ్నం అదుపు చేశారు. రాత్రి మంటలు చెలరేగగా ఉదయం విషయం తెలుసుకున్న అధికారులు మంటలను ఆర్పే పనులు ప్రారంభించారు. వెదురు మొలకల వద్ద నిప్పు ఉండడంతో బ్లోయర్లతో సిబ్బందిని పంపించి మంటలను పూర్తిగా అదుపు చేసినట్లు అటవీ రేంజ్ అధికారి సుభాష్ తెలిపారు.

బొగ్గు ఉత్పత్తి పెంచాలి



ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శ్రీరాంపూర్ ఓసీపీని ఆదివారం సందర్శించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోజువారీ ఉత్పత్తిని పెంచుకుంటే లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. బొగ్గు ఉత్పత్తి ఖర్చును తగ్గిస్తే మరిన్ని లాభాలు సాధించవచ్చని తెలిపారు. ఉత్పత్తి ఒక్కటే ముఖ్య కాదని, రక్షణతో కూడిన ఉత్పత్తి ముఖ్యమన్నారు. అనంతరం ఓబీ నూతన కాంట్రాక్టర్‌తో పనులపై చర్చించారు. ఓబీ నిర్దేశించినంత వెలికి తీయాలన్నారు. ఓబీ సాధిస్తేనే బొగ్గు వెలికి తీసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఏజెంట్‌లు సత్యనారాయణ, గోపాల్‌సింగ్, ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి, మేనేజర్ సుధీర్, డీజీఎంలు చిరంజీవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హెల్త్‌కార్డుకు అవకాశం



మాట్లాడుతున్న నాయకులు

మంచిర్యాలటౌన్: సింగరేణిలో పదో వేజ్‌బోర్డు ప్రకారం 2016 జూలై 01 తరువాత ఉద్యోగ విరమణ చేసి సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డును తీసుకోని వారికి మరోసారి యాజమాన్యం అవకాశం కల్పించిందని తెలంగాణ సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం నాయకులు తెలిపారు. హెల్త్‌కార్డు కావాల్సిన వారు మార్చి 31లోపు బ్యాంకుల్లో రూ.40 వేల డీడీ సంబంధిత డిపార్టుమెంట్ పేరిట తీసి దరఖాస్తు చేసుకోవాలని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. విశ్రాంత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు చిప్ప రామస్వామి, అడిచర్ల రాజేశం, ఎం.నర్సయ్య పాల్గొన్నారు.

బీజేపీని అధికారంలోకి తేవాలి

- బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్




మాట్లాడుతున్న అరవింద్ మీనన్

మంచిర్యాలక్రైం: భారతీయ జనతా పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తేవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అధ్యక్షతన పదాధికారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో అరవింద్ మీనన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నందున పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేసి అధికారంలోకి తెచ్చేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ సమస్యలపై పోరాటం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి, ముల్కల్ల మల్లారెడ్డి, పోనుగంటి రంగారావు, మల్లికార్జున్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, రజినీష్‌జైన్ మునిమంద రమేశ్, అందుగుల శ్రీనివాస్, పెద్దపెల్లి పురుషోత్తం, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ధరణి అదే ధోరణి..!



ఈ మహిళా రైతు పేరు గడికొప్పుల లక్ష్మి. దండేపల్లి మండలం వెల్గనూర్‌కు చెందిన ఈమెకు గ్రామంలోని సర్వే నంబర్ 301ఇ, లో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. కానీ ఇప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. రెండేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదు. రెండు నెలల క్రితం మిస్సింగ్ సర్వే నంబర్ కింద మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు భూమి ఆన్‌లైన్‌లోకి ఎక్కలేదు. దీంతో రైతుబంధు, రైతుబీమాకు నోచుకోవడం లేదు.



- పెండింగ్‌లో భూసమస్యలు..
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ

దండేపల్లి: గ్రామాల్లో భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. 2020, నవంబర్‌లో ధరణిపోర్టల్ ప్రారంభించారు. పోర్టల్‌లో లోపాలను సవరిస్తూ మార్పులు చేస్తున్నా రైతుల భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో ప్రతీ సోమవారం, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా వస్తున్నాయి. సమస్యలు పరిష్కారం కావాలంటే, ధరణి పోర్టల్‌లో మార్పులు చేయడంతోపాటు అధికారులకు వెసులుబాటు ఉండాలని పలువురు పేర్కొంటున్నారు.

పెండింగ్‌లోనే దరఖాస్తులు..

జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో భూములకు సంబంధించి మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణం ఎక్కువ, తక్కువ, నోషనల్‌ఖాతా పట్టాలు, భూ స్వభావం, రకం, వంటి సవరణలకు సంబంధించి, టీఎం 33 లో భాగంగా అనేక మంది దరఖాస్తులు చేసుకున్నారు. అందులో చాలా వరకు దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. సమస్య పరిష్కారం కోసం బాధితులు, మండల కేంద్రాల్లోని తహసీల్ కార్యాలయాలతోపాటు, డివిజన్ కేంద్రాల్లోని ఆర్డీవో, జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కొంమంది హైదరాబాద్‌లోని సీసీఎల్‌కు కూడా వెళ్లి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

పరిష్కారం లభించేనా?

ధరణి పోర్టల్‌లో భూముల లావాదేవీలకు సంబంధించి తలెత్తుతున్న చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్) నవీన్ మిత్తల్ కసరత్తు ప్రారంభించారు. సమస్యలను గుర్తించి వాటిని సవరించేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయిస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. ధరణి పోర్టల్‌లో మార్పులు వారంలోపే పూర్తవుతాయని తెలిపారు. దీంతో ధరణి పోర్టల్‌లో వస్తున్న పదికిపైగా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీసీఎల్ వర్గాలు పేర్కొంటున్నాయి. మిత్తల్ మార్కుతో పెండింగ్ ఫైళ్లకు మోక్షం లభిస్తుందన్న ఆశ దరఖాస్తుదారుల్లో చిగురిస్తోంది.

దండేపల్లి మండలంలోనే అధికం..

జిల్లా మొత్తంలో దండేపల్లి మండలంలోనే భూసమస్యలకు సంబంధించి అత్యధికంగా 788 దరఖాస్తులు వచ్చాయి. అందులో 179 దరఖాస్తులు అప్రూవల్ కాగా, 226 రిజెక్ట్ అయ్యాయి. 34 దరఖాస్తులు సీసీఎల్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. 218 దరఖాస్తులకు నోటీస్ జనరేట్ కాగా, ఇంకా 131 దరఖాస్తులకు నోటీస్ జనరేట్ కాక పోవడంతో, 349 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ దరఖాస్తులపై దృష్టిసారించి, భూసమస్యలు పరిష్కరించాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు.

కలెక్టరేట్‌కు పంపిస్తున్నాం..

భూ సమస్యలకు సంబంధించి, మీసేవ కేంద్రాల్లో రైతులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. కలెక్టర్ లాగిన్‌కు వెళ్లిన దరఖాస్తులకు సంబంధించిన సమాచారం అడిగిన వెంటనే వాటికి సంబంధించిన ఫైల్స్ కలెక్టరేట్‌కు పంపిస్తున్నాం. అందులో కొన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. కొన్ని పెండింగ్‌లో ఉంటున్నాయి. చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నారు. త్వరలోనే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి.

– హన్మంతరావు, తహసీల్దార్, దండేపల్లి

5,691 దరఖాస్తులు..

మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణం హెచ్చు, తగ్గులు, భూమి స్వభావం, రకాలకు సంబంధించి జిల్లాలోని 18 మండలాల నుంచి ఈనెల 8 వరకు 5,691 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 1,512 దరఖాస్తులు అప్రూవల్ కాగా, 2,060 దరఖాస్తులు రిజెక్ట్ అయ్యాయి. 172 దరఖాస్తులు సీసీఎల్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. 1,431 దరఖాస్తులకు నోటీస్ జనరేట్ కాగా, 516 దరఖాస్తులకు ఇంకా నోటీస్ జనరేట్‌కాలేదు. దీంతో ఇంకా జిల్లా వ్యాప్తంగా 1,947 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండి పోయాయి. వీటితోపాటు డీఎస్ పెండింగ్, సక్సేషన్, మ్యుటేషన్స్, నాలా కన్వర్షన్, ఖాతామెర్జ్‌లకు సంబంధించిన దరఖాస్తులు కూడా చాలా వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి.

నాలా శుభ్రం చేయరా?

- ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై అదనపు కలెక్టర్ ఆగ్రహం
- వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశం



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలక్రైం/పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని వసతి గృహాలను అదనపు కలెక్టర మధుసూదన్‌నాయక్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్యూల్ కులాల కళాశాల వసతి గృహంలో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలాలో చెత్త పేరుకుపోవడంతో వార్డెన్ కుమారస్వామిని మందలించారు. ఆయనకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డికి సూచించారు. సాయికుంటాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహం, షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహం, షెడ్యూల్ తెగలు బాలుర వసతి గృహాలను సైతం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. భోజనంలో మెనూ పాటించాలని ఆదేశించారు. వసతి గృహాల పరిసరాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీలో సమస్యలపై ఎమ్మెల్యే అసహనం..



సమస్యలపై డీఈఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వేమనపల్లి: నీల్వాయిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో వసతులపై అసహనం వ్యక్తం చేశారు. టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. క్లాస్ రూమ్‌లో మంచాలు, పడుకునే బట్టలు ఉంచడంపై స్టాఫ్‌ను నిలదీశారు. కంప్యూటర్లు పనిచేయడం లేదని సిబ్బంది తెలపడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్య అవసరమన్నారు. కంప్యూటర్లు పనిచేయడం లేదని తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి కేజీబీవీలో సమస్యలపై ఆరా తీశారు. కంప్యూటర్లు బాగు చేయించాలని అవసరమనుకుంటే డీఎంఎఫ్‌టీ నిధులతో రిపేర్ చేయించి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థినులు పరీక్షల్లో 10 జీపీఏ సాధించాలని సూచించారు. ఆయన వెంట సీఐ విద్యాసాగర్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, కుమ్మరి బాపు, జాహెద్‌అలీ, మాజీ కోఆప్షన్ సభ్యుడు హమీద్‌ఖాన్ ఉన్నారు.

పేరుకే మహిళా ఠాణా..!

- విధులు నిర్వహించేవారిలో పురుషులే అధికం
- మహిళా సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం
- సమస్యలు చెప్పుకోవడానికి ఇబ్బంది పడుతున్న మహిళలు

మంచిర్యాలక్రైం: మహిళల రక్షణ కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాగా ఉన్నప్పుడే 2015 మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి జిల్లా ఎస్పీ తరుణ్‌జోషి, స్థానిక ఏఎస్పీ విజయ్‌కుమార్ మంచిర్యాల పట్టణంలో మహిళా పోలీస్ స్టేషన్ ప్రారంభించారు. ప్రారంభంలో సిబ్బంది కొరత కారణంగా ఒక మహిళా ఎస్సై, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు మాత్రమే ఉండేవారు. మిగతా వారందరూ పురుషులే విధులు నిర్వహించేవారు. క్రమంగా కేసులు పెరుగుతుండడంతో స్టేషన్‌కు పురుష అధికారిని ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికీ పురుష అధికారుల ఆధిపత్యమే కొనసాగుతోంది. సిబ్బంది మొత్తం పురుషులే ఉండడం.. చివరకు నిర్ణయం తీసుకునే ఎస్‌హెచ్‌వో సైతం పురుషుడే కావడంతో మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది ఠాణాకు రావడానికే భయపడుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ సీఐ, మరో ఎస్సై మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడం కూడా ఇందుకు కారణం. బాధితుల నుంచి డబ్బులు డిమాండ్ చేసి సస్పెండ్ అయిన పోలీసులు కూడా ఉన్నారు. అయినా మహిళా పోలీస్ స్టేషన్‌కు మహిళా అధికారిని నియమించడంలో ఆశాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

సీఐదే తుది నిర్ణయం..


మహిళా ఠాణా ఎస్‌హెచ్‌వోలు పురుషులనే పోలీస్ శాఖ నియమిస్తోంది. దీంతో ఇక్కడ మహిళా ఎస్సైలు ఉన్నా.. సీఐ నిర్ణయమే ఫైనల్ కావడంతో తమకు అన్యాయం జరుగుతోందని కొంతమంది మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భర్త, అత్తమామల వేధింపులను పురుష అధికారులకు ఎలా చెప్పుకోవాలో తెలియడం లేదని పేర్కొంటున్నారు. పురుషాధిక్యంతో కొంతమంది ఠాణాకు రాకుండా పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించుకుంటున్నారు.

జిల్లాలో మహిళా పోలీసుల కొరత...

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా 7,48,919. ఇందులో మహిళలు 3,58,970 మంది ఉన్నారు. పురుషులతో మహిళలు దాదాపు సమానంగానే ఉన్నారు. గ్రామీణ ప్రాంత జనాభాలో మాత్రం మహిళలు ఎక్కువగా ఉన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు మహిళా జనాభా 90 వేలు. జిల్లాలో మహిళా పోలీస్ అధికారులు మాత్రం 53 మందే ఉన్నారు. మహిళా అధికారుల కొరత కారణంగా మహిళా పోలీస్ స్టేషన్‌లోనూ పురుషులే విధులు నిర్వహిస్తున్నారు.

సబ్ డివిజన్‌కే పరిమితం..

మంచిర్యాల, బెల్లంపెల్లి, జైపూర్ మూడు పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో మహిళల సహాయార్థం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్‌లో జిల్లా వ్యాప్తంగా కుటుంబ సమస్యలు, భార్య, భర్తల గొడువలు పరిష్కరించే అవకాశం ఉంది. కొన్ని రోజులు జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. కొద్ది రోజుల క్రితం మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిని మంచిర్యాల సబ్ డివిజన్‌కే పరిమితం చేశారు.



మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్

మహిళా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది..

పోస్ట్	స్త్రీలు	పురుషులు
సీఐ	00	01(బాధ్యతలు తీసుకోలేదు)
ఎస్సై	02	00
ఏఎస్సై	00	02
హెడ్‌కానిస్టేబుళ్లు	00	05
కానిస్టేబుళ్లు	03	05
మొత్తం	05	13

జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా పోలీసులు..

ఎస్సైలు	06
ఏఎస్సైలు	05
హెడ్‌కానిస్టేబుళ్లు	04
కానిస్టేబుళ్లు	20
హోంగార్డులు	23
మొత్తం	58

అభివృద్ధి పేరుతో ఆస్తుల ధ్వంసం

- మహిళ భవన్ నిర్మాణం కోసం.. నీటి పారుదల భవనానికి ఎసరు..
- పట్టణానికి దూరంగా ప్రభుత్వ కార్యాలయాలు



ఇరిగేషన్ కార్యాలయ స్థలం చదును చేసిన దృశ్యం

చెన్నూర్: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ ఆస్తులకే ఎసరు వస్తోంది. అభివృద్ధి పేరుతో ఉన్న కార్యాలయాలను కూల్చి కొత్తవి నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫలితంగా ప్రజాధనం వృథా అవుతోంది. అధికారుల నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతన భవనాల మంజూరు కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆ స్థలాల్లో కొత్తవి నిర్మించాలి. చెన్నూర్‌లోని వివిధ శాఖల అధికారుల మాత్రం ఆదిశగా ఆలోచించకుండా మనుగడలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు ఎసరు పెడుతున్నారు. ప్రజాప్రతినిధుల మెప్పు పొందేందుకు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. ప్రజాధనం వృథా చేస్తున్నారు.

ఆ కార్యాలయానికి 60 ఏళ్ల చరిత్ర..

60 ఏళ్ల క్రితం అప్పటి సర్కార్ చెన్నూర్ పట్టణంతోపాటు మండల రైతులకు అందుబాటులో ఉండేలా పట్టణం నడిబొడ్డున నీటిపారుదల శాఖ భవనం నిర్మించింది. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో 2013లో రూ.10 లక్షలతో నూతన భవనం నిర్మించారు. తాజాగా ఈ భవనం కూల్చివేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ భవనం స్థానంలో మహిళ భవన్ నిర్మించాలని చూస్తున్నారు. 10 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలని నిర్ణయించంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఓ అధికారి తప్పుడు నివేదికతోనే..

ప్రస్తుతం ఉన్న సబ్ డివిజనల్ ఇరిగేషన్ భవనం శిథిలావస్థకు చేరినట్లు మున్సిపాలిటీలో విధులు నిర్వహించిన ఓ అధికారి తప్పుడు నివేదిక సమర్పించారు. పదేళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడం ఏమిటని నీటిపారుదల శాఖ అధికారులు ఖంగుతిన్నారు. ఆ అధికారి ఇచ్చిన తప్పుడు నివేదిక ఆధారంగా మహిళా భవన్ నిర్మాణం కోసం ఇరిగేషన్ కార్యాలయానికి ఎసరు పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 15న మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా మహిళా భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయించేందుకు ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో భూమి కూడా చదును చేశారు. రెండు రోజుల్లో కార్యాలయం భవనాన్ని కూల్చివేస్తామని అందులోని సామగ్రిని తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

అభివృద్ధి పేరుతో కూల్చివేత..

అభివృద్ధి పేరుతో అధికారులు ప్రభుత్వ ఆస్తులను కూల్చివేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- పట్టణంలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇరువైపులా విస్తరణ చేపట్టాల్సిన అధికారులు ఒకవైపే విస్తరణ చేసి.. ఎస్సీ కార్పొరేషన్ భవనం కూల్చివేశారు. భవనం కూల్చివేతతో ప్రభుత్వ ఆస్తితోపాటు ప్రజాధనం వృథా అయింది.
- మున్సిపాలిటీ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వైపుగా ఒకే పక్కన రోడ్డు వెడల్పు చేయడంతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న 16 షెడ్లు, పోలీసు స్టేషన్, ఫారెస్ట్, ప్రహరీ కూల్చివేశారు.
- చెన్నూర్ పట్టణంలోని కత్తెరశాల రోడ్డు మార్గంలో పట్టణ ప్రగతిలో భాగంగా మూడేళ్ల క్రితం రూ.10 లక్షలతో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. అందులో సుమారు 5 వేల మొక్కలు నాటి సంరక్షించారు. ప్రస్తుతం అదే స్థలాన్ని వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి కేటాయించారు. దీంతో మొక్కలను ధ్వంసం చేసి స్థలం చదును చేశారు.
- తాజాగా మహిళా భవన్ కోసం నీటిపారుదల శాఖ భవనం కూల్చివేయాలని నిర్ణయించారు. రూ.10 లక్షలతో పదేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని నేడో రేపో కూల్చివేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇలా ఒక్కొక్కటిగా ప్రభుత్వ ఆస్తులనే అధికారులు టార్గెట్ చేయడం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా చెన్నూర్‌ను అభివృద్ధి చేయడాన్ని స్వాగతిస్తున్న ప్రజలు ఇందు కోసం ప్రభుత్వ ఆస్తులను కూల్చివేయాన్ని తప్పు పడుతున్నారు. కాపాడాల్సిన అధికారులే ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న భవనాలు కూల్చకుండా, ప్రభుత్వ స్థలాలను గుర్తించి నూతన నిర్మాణాలు చేయాలని కోరుతున్నారు.

ముంపు భూములకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

చెన్నూర్‌రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టుతో చెన్నూర్, కోటపల్లి, జైపూర్ మండలాల్లో ముంపునకు గురవుతున్న భూములకు ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించలేదని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని గంగారం గ్రామంలో వివేక్ ఆధ్వర్యంలో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఈ విషయం ప్రజలకు తెలియజేసేందుకే సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కమీషన్ల ప్రాజెక్టుగా మారిందన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా ఇసుక మాఫియా ఇక్కడ ఉందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిపై దాడులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ముంపు రైతుల పరిహారం కోసం గవర్నర్‌ను కలిశామని, ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం రాకపోవడం సిగ్గు చేటన్నారు. కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు తెలియజేయకుండా కేసీఆర్ కపట నాటకం ఆడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎర్రవెల్లి రఘునాథ్, పార్లమెంట్ ప్రభారి విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల్ల మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మునిమంద రమేశ్, అసెంబ్లీ కోకన్వీనర్ అక్కల రమేశ్, మండల అధ్యక్షుడు ఆలం బాపు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

మందమర్రిరూరల్: సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తూ తక్కువ వేతనాలతో సింగరేణికి లాభాలు తీసుకువస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాలు, టీబీజీకేఎస్ విస్మరిస్తున్నాయని ఆరోపించారు. ఏరియాలో కాంట్రాక్టర్ చనిపోవడంతో ఆయన వద్ద విధులు నిర్వహించే కార్మికులను ఆరు నెలలు యాజమాన్యం విధుల్లో తీసుకోలేదు. దీంతో సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టగా వారిని విధుల్లోకి తీసుకోగా వారు ఈనెల వేతనాలు పొందారు. దీంతో ఆదివారం సంజయ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు షరీఫా, సంపత్, లక్ష్మీరాజం, సత్యనారాయణ, కాంట్రాక్ట్ కార్మికులు సంధ్య, శంకర్, ధనలక్ష్మి, నర్మద, మహేష్, సరస్వతి పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎల్సీతో సమావేశం

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై సోమవారం రిట్నరింగ్ అధికారి సమావేశం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఆర్‌ఎల్సీ కార్యాలయంలో రిజిస్ట్రార్ సంఘాలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో గుర్తింపు సంఘం ఎన్నికలపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

కిష్టాపూర్ విద్యార్థుల ప్రతిభ



ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు

జన్నారం: జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ప్రతీ సంవత్సరం ఉపకార వేతనాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు, ఈ సంవత్సరం శనివారం విడుదలైన ఫలితాల్లో 15 మంది జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని హెచ్ఎం జాడి మురళి తెలిపారు. ఇప్పటి వరకు కిష్టాపూర్ ఉన్నత పాఠశాల నుంచి 231మంది ఎంపికైనట్లు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


సమ్మక్క మృతదేహం

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కోగిల సమ్మక్క(45) మహిళ శనివారం రాత్రి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. సమ్మక్క ఇంటిలో టీవీ ఆన్ చేయడానికి ఇంటి ముందు కిటికి పక్కన గోడకు ఉన్న ప్లగ్ బాక్సుకు టీవీ ప్లగ్ పెడుతున్న క్రమంలో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త మల్లయ్యతో పాటు కుమారుడు ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎల్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సూర్య ప్రకాశ్ పేర్కొన్నారు.

ఖానాపూర్ నియోజకవర్గంపై దృష్టి సారించండి


భట్టి విక్రమార్కతో వినోద్‌నాయక్

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, భట్టి విక్రమార్క సూచించినట్లు ఏఐసీసీ రీసర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కన్వీనర్ వినోద్ నాయక్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో భట్టి విక్రమార్కను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అదే విధంగా భట్టి విక్రమార్క చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేస్తామని తెలిపినట్లు వివరించారు.

'అడెల్లి'కి పోటెత్తిన భక్తులు


ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సారంగపూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

'గురుకులం'లో ప్రవేశాలు


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

- ఈ నెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 5వ తరగతిలో ప్రవేశాలు
- ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష
- ఆదిలాబాద్ రీజియన్‌లో 17 గురుకులాలు, 1,360 సీట్లు

మంచిర్యాలటౌన్: కేజీ టు పీజీ ఉచిత విద్యలో భాగంగా ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గత నెలలోనే ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించి ఈ నెల 6వ తేదీ వరకు చివరి తేదీగా నిర్ణయించగా విద్యార్థుల సౌకర్యార్థం గడువును ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించారు. ఇంగ్లిషు మీడియంలో విద్యా బోధనను విజయవంతంగా కొనసాగిస్తున్న గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలను పొందేందుకు విద్యార్థులు ఆసక్తిని చూపిస్తున్నారు. గత నెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది.

ఆదిలాబాద్ రీజియన్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు	: 17
5వ తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో 80 సీట్ల చొప్పున	: 1,360

ఆదిలాబాద్ రీజియన్‌లో 17 పాఠశాలలు...

ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో 17 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలున్నాయి. 5వ తరగతిలో 80 సీట్ల చొప్పున ప్రవేశాలను జరుపుతుండగా, మొత్తం 1,360 సీట్లు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధనతో పాటు, భోజన వసతి, సకల సదుపాయాలు కల్పించనున్నారు. మొత్తం 80 సీట్లకు ఎస్సీలకు 60, కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 2, ఎస్టీలకు 5, బీసీలకు 10, మైనారిటీలకు 2, ఓసీ/ఓబీసీలకు 1 సీటును కేటాయిస్తారు. ఆయా పాఠశాలల్లో ఒక్కోసారి ప్రవేశం పొందితే 10వ తరగతి వరకు ఉచితంగా చదువు, హాస్టల్ వసతితో పాటు, అన్ని రకాల వసతులను కల్పించడం, పుస్తకాలు, బట్టలు, కాస్మొటిక్ చార్జీలను అందిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ గర్ల్స్, బోథ్ గర్ల్స్, ఇచ్చోడలో బాయ్స్ గురుకులాలు ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్ బాయ్స్, సిర్పూర్(టి) బాయ్స్, సిర్పూర్(టి) గర్ల్స్, కాగజ్‌నగర్ గర్ల్స్, రెబ్బెన గర్ల్స్‌గురుకుల పాఠశాలలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో లక్సెట్టిపేట్ గర్ల్స్, చెన్నూరు గర్ల్స్, జైపూర్ బాయ్స్, కోటపల్లి బాయ్స్, మంచిర్యాల బాయ్స్, మందమర్రి గర్ల్స్, బెల్లంపల్లి బాయ్స్(సీఈవో), బెల్లంపల్లి గర్ల్స్, కాసిపేట బాయ్స్ ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు

సాంఘిక గురుకుల సంక్షేమ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు కేవలం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం www.tswreis.ac.in, http:/tgcet.cgg.gov.in, http:/tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లలో ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తుకు రూ.100 చెల్లించడంతో పాటు, ఒక ఫోన్ నంబరుతో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చు. వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే వారిపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 1800 425 45678, 040–24734899, 9121174434 లేదా ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న సంబంధిత గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఫోన్‌లో సంప్రదించవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు2022–23 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు, ప్రవేశపరీక్షను ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహిస్తారు.

ఇవీ ప్రత్యేకతలు..

- సన్నబియ్యంతో సహా అన్ని పోషక విలువలు ఉన్న రుచికరమైన ఆహారం.
- పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా సరఫరా.
- విద్యార్థులకు స్టేషనరీ (పెన్సిల్, రికార్డు పుస్తకాలు వంటివి) ఉచితం.
- మూడు జతల స్కూల్ యూనిఫాం, ట్రంకు బాక్సులు సరఫరా
- పీ.టి. డ్రెస్, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ షూ, సాక్స్, నైట్ డ్రెస్, ప్లేట్, గ్లాస్, కటోర, స్పూన్, బెడ్‌షీట్, బ్లాంకెట్, పరుపులు ఉచితంగా సరఫరా.
- విద్యార్థులకు సబ్బులు కొనేందుకు డబ్బుల పంపిణీ.
- నెలలో నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మటన్‌తో భోజనం.
- వారంలో నాలుగు రోజులు కోడిగుడ్లు, ఆరు రోజులు పండ్లు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ వరకు స్వీకరిస్తారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని 17 గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు చేసుకునేందుకు అవకాశం ఉంది. – కొప్పుల స్వరూపారాణి, గురుకుల విద్యాలయాల ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు


గాయపడిన బాలుడు ప్రణీత్

నెన్నెల: మండలంలోని మైలారంలో ఆదివారం ముగ్గురిపై పిచ్చికుక్క దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. ఎస్సీ వాడలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడు వేల్పుల ప్రణీత్‌పై పిచ్చికుక్క దాడి చేయగా అతడిని కాపాడేందుకు వెళ్లిన లింగంపల్లి నీరజపై సైతం దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. వీరితో పాటు బాలవోనివాడలో పోల్క చరణ్‌పై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో వారిని నెన్నెల పీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. ఒకే రోజు ముగ్గురిపై దాడి చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు జంకుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పిచ్చికుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కొర్రే మోహన్ (ఫైల్)

బెజ్జూర్: బైక్‌పై నుంచి కిందపడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని సోమిని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ వివరాల ప్రకారం... కొర్రే మోహన్ (20) అందుగులగూడ గ్రామంలోని ఓ శుభకార్యానికి బైక్‌పై బయలుదేరాడు. ఆ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి గుంతలో పడ్డాడు. గుంతలోని బండరాళ్లు తలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడు నెలల బాలుడు, భార్య ఉన్నారు.

నిలిచిన సమావేశాలు

- పెండింగ్‌లో కార్మికుల సమస్యలు
- రెండేళ్లుగా ఊసేలేని స్ట్రక్చరల్, సేఫ్టీ ట్రైపార్టియేట్ మీటింగ్స్
- జేసీసీ కూడా అంతే
- పట్టించుకోని సంఘాలు.. కార్మికుల ఆగ్రహం

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికుల సమస్యలపై చర్చించి ఒప్పందాలు చేసుకునే స్ట్రక్చరల్, జేసీసీ, సేఫ్టీ ట్రైపార్టియేట్ వంటి ముఖ్యమైన సమావేశాలు నిలిచిపోయాయి. దీంతో కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోక మరుగున పడుతున్నాయి. రెండేళ్లుగా ఈ సమావేశాలను యాజమాన్యం నిర్వహించకపోవడంతో కార్మికవర్గం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది.

3 నెలలకోసారి స్ట్రక్చరల్ సమావేశం..

ప్రతి మూడు నెలలకోసారి కంపెనీ సీఎండీ స్థాయిలో, 2 నెలలకోసారి డైరెక్టర్(పా) కార్పొరేట్ స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించాలి. ఇందులో గుర్తింపు సంఘం నాయకులు పాల్గొని కార్మికుల డిమాండ్లు, సమస్యలను యాజమాన్యం ముందు పెట్టి చర్చించి పరిష్కరించుకుంటారు. ఇక్కడ జరిగిన అవగాహన ఒప్పందం మేరకు ఆర్‌ఎల్సీ వద్ద రాతపూర్వక ఒప్పందం చేసుకొని దానికి అనుగుణంగా కంపెనీ అధికారిక ఉత్తర్వులు విడుదల చేస్తారు. ఈ స్ట్రక్చరల్ సమావేశం తర్వాత రెండోరోజు జాయింట్ కన్సల్టింగ్ కమిటీ(జేసీసీ) నిర్వహిస్తారు. దీనికి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా హాజరై కార్మికుల సమస్యలను యాజమాన్యం ఎదుట చర్చిస్తారు. ఇవేవి జరగడం లేదు. అయితే 2017 అక్టోబర్ 5న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. 2018 ఏప్రిల్ 18న అధికారికంగా గుర్తింపునిచ్చారు. అప్పటి నుంచి కేవలం నాలుగుసార్లు మాత్రమే కార్పొరేట్ స్థాయిలో సమావేశాలు జరిగాయి. గడిచిన రెండేళ్లుగా పూర్తిగా నిలిచిపోయాయి. ఏరియా స్థాయిలో స్ట్రక్చరల్ సమావేశాలను ప్రతి నెలకోసారి జీఎం ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉన్నా జరగడం లేదు.

ఎన్నికలయ్యే వరకు ఆగాల్సిందేనా..

యాజమాన్యం వైఖరి చూస్తే గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగే వరకు ఆగాల్సిందే. గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లు పూర్తయిందని, దీనికి మించి మరో రెండేళ్లవుతున్నా ఎన్నికలు నిర్వహించాలని ప్రధాన ప్రతిపక్ష సంఘాల నేతలు సీఎల్సీకి ఫిర్యాదు చేశారు. 2022 ఏప్రిల్ నుంచి అన్ని సంఘాలకు సమస్యలపై రిప్రజెంటేషన్ చేసే అవకాశం కల్పించింది. ఇప్పుడు అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తున్న నేపథ్యంలో మళ్లీ ఈ సమావేశాలు ఎన్నికలు జరిగిన తర్వాతే నిర్వహించే అవకాశాలున్నాయి.

సేఫ్టీ ట్రైపార్టియేట్ లేదు

గనుల్లో జరిగే ప్రమాదాలపై, చేపట్టే రక్షణ చర్యలపై ఆరు నెలలకోసారి జరగాల్సిన సేఫ్టీ ట్రైపార్టియేట్ సమావేశం నిర్వహించడం లేదు. ఇందులో యాజమాన్యం, డీజీఎంఎస్ విభాగం అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొంటారు. ఈ సమావేశాలను యాజమాన్యం నిర్వహించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గనుల్లో పెరుగుతున్న ప్రమాదాలు, చనిపోయిన కార్మికులకు నష్టపరిహారం కోసం డిమాండ్లు, ఇతర సేఫ్టీ సమస్యలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

పెండింగ్‌లోని కార్మికుల డిమాండ్లు

మారుపేర్లతో పనిచేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలి. కొత్త గనులు ఏర్పాటు చేయాలి. పెర్క్స్‌పై ఆదాయ పన్నును కంపెనీ చెల్లించాలని డిమాండ్‌పై చర్చించాలి. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి. సింగరేణిలో ప్రైవేటీకరణ, బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకోవాలి. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి. గనుల్లో సేఫ్టీ పెంచాలి. ప్రమాదాలు తగ్గించాలి.

సింగరేణి రిటైర్డ్ అధికారుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న రిటైర్డ్ అధికారులు

రామకృష్ణాపూర్: సింగరేణి సంస్థలో 38 ఏళ్లు పని చేసి ఉద్యోగ విరమణ పొందిన సర్వే అధికారులు మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ శివారులో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 మంది అధికారులు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. వారి అనుభవాలను పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఉంటున్నవారితోపాటు తమిళనాడు, కేరళ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. రిటైర్డ్ అధికారి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో సమ్మేళనం జరిగింది.

మధురస్మృతులు.. మదిలో మెదిలిన వేళ

- 30ఏళ్ల తరువాత ఒకేచోట చిన్ననాటి మిత్రులు
- పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులు

దండేపల్లి: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. అంటూ 30 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులంతా ఒకేచోట కలుసుకున్నారు. మధుర స్మృతులను నెమరేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. తారతమ్యాలు లేని లేత వయస్సులో చదువుతూ స్నేహితులైన వారంతా పదో తరగతి పూర్తికాగానే ఉన్నత చదువుల కోసం ఎటువారు అటు విడిపోయారు. 30ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకునే సరికి వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇదంతా దండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం చోటుచేసుకుంది. ఇదే పాఠశాలలో 1992–93లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో కలుసుకున్నారు. ఉన్నత చదువులు చదివి కొంత మంది ఉద్యోగాల్లో, మరికొంత మంది వ్యాపారాలు చేస్తూ జీవితంలో స్థిరపడ్డారు. వారంతా ఒకేచోట కలుసుకుని చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు.

సంతోషంగా ఉంది..



చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. ఇక్కడ పదో తరగతి అవగానే ఉన్నత చదువుల కోసం ఎటువాళ్లు అటువెళ్లిపోయాం. ఆ తరువాత పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడ్డాం. 30 ఏళ్ల తరువాత ఒకే చోట కలవడం చాల ఆనందంగా ఉంది. చాలా ఏళ్ల తరువాత కలుసుకోవడంతో గుర్తుపట్టుకోలేదు. – శ్రీదేవి, నెల్లూరు

మరిచిపోలేని రోజు..



ముప్పై ఏళ్ల తర్వాత స్నేహితులందరం కలుసుకోవడం మధురానుభూతినిచ్చింది. ఇది జీవితంలో మర్చిపోని రోజు. చిన్నప్పుడు చదువుకున్న స్నేహితులను, చదువు చెప్పిన గురువులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. గెట్ టూ గెదర్ నిర్వహిస్తున్నట్లు సమాచారం ఇవ్వగానే వచ్చేశాను. – హేమలత, హిందీపండిట్, ధర్మారం, కేజీబీవీ

స్నేహానికి ప్రాణం పోసినట్టు...



పదో తరగతి పూర్తికాగానే ఉన్నత చదువుల కోసం అందరం విడిపోయాం. అప్పటి నుంచి మిత్రులను కలుసుకోలేకపోయాను. పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంతో చదువుకున్న పాఠశాలలోనే మిత్రులందరం కలుసుకోవడం చిన్ననాటి స్నేహానికి ప్రాణం పోసినట్టనిపించింది. – రత్నయ్య, ట్రాన్స్‌కో ఏఈఈ, ఆదిలాబాద్

గుర్తుకొస్తున్నాయి..!

- 50ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు


1970-71 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు

ఆసిఫాబాద్: ఆరు పదులు దాటిన వయస్సు అందరిదీ... వివిధ వృత్తుల్లో పని చేసి కుటుంబ బాధ్యతలు తీర్చుకుని జీవితంలో స్థిరపడ్డారు. వారంతా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1970–71 పదో తరగతి పూర్తి చేశారు. సుమారు 50ఏళ్ల తరువాత పూర్వవిద్యార్థుల సమ్మేళనం ద్వారా ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో కలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మిత్రులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ముందుగా లోకం విడిచి వెళ్లిన వారికి బోధించిన గురువులు, మిత్రులకు సంతాపం ప్రకటించారు. అప్పటి గురువులు పొందు రంగరావు, రామానుజంలను శాలువలు, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాచం మధుకర్, పిన్న అశోక్, ముక్త సురేశ్, పంచదార దీపక్‌రావు, తాటిపెల్లి అశోక్, రావుల ప్రేమ్‌సాగర్, మధుకర్, మారవిశ్వనాథం, సిద్దం నాగేశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

అన్నాభావుసాఠె ఆదర్శప్రాయుడు

- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్లు జనార్దన్, కోవలక్ష్మి
- నార్నూర్‌లో అన్నాబావుసాఠె విగ్రహం ఆవిష్కరణ
- సొంత నిధులతో ఏర్పాటు చేయించిన సర్పంచ్ గజానంద్


అన్నాబావుసాఠె విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

నార్నూర్: సాహితీ రత్న డాక్టర్ అన్నాభావుసాఠె ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలో సర్పంచ్ గజానంద్‌నాయక్ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన అన్నాభావుసాఠె విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇలాంటి మహనీయుల చరిత్రలు తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని, ప్రతీ కుటుంబంలో పిల్లల చదువుకునేలా చూడాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉంటేనే సమాజం, గ్రామం అభివృద్ధి చెందుతుందని వివరించారు. అనంతరం లంబాడా సంప్రదాయ దుస్తులతో జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మిని గిరిజన మహిళలు సన్మానించారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరిస్తాం...

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులకు ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని దళిత నేతలు జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివాసముంటున్న దళితుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని వివరించారు. సీఎం కేసీఆర్, సీఎస్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మతాంగ్ ఋషి సంస్థాన్ పీఠాధిపతి గజానంద్ మౌలి, ఎంపీపీ కనక మోతుబాయి, కుమురంభీం జిల్లా గ్రంథాలయశాఖ చైర్మన్ కనక యాదవ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేష్, ఎంపీటీసీ పరమేశ్వర్, అన్నాభావుసాఠె కమిటీ జిల్లా అధ్యక్షుడు కాంబ్లె ఉదయ్, మండల అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి బర్‌కుంబే రాజు, దళిత నాయకులు భారత్ వాఘ్మారే, నర్సింగ్‌మోరే, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు యునుస్ అక్బానీ ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

తాండూర్: అనుమానాస్పదస్థితిలో రైలుకిందపడి వివాహిత మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... భీమిని మండలం జనకాపూర్ గ్రామానికి చెందిన శ్రీలత(25)కు తాండూర్‌లోని బెస్తవాడకు చెందిన పెద్దబోయిన మహేందర్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. శ్రీలత ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త, కుటుంబీకులు బంధువుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం కానరాలేదు. సాయంత్రం మండల కేంద్రంలోని పాత గోదాంల సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శ్రీలత శవమై కనిపించడంతో స్థానికులు ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. శ్రీలత మృతితో తాండూర్‌లో విషాదం అలుముకుంది.